# సాక్షి సంగారెడ్డి

మంగళవారం । 22 । ఏప్రిల్ । 2025






**కమ్మేస్తున్న కాలుష్యం**

పరిశ్రమల విష వాయువులతో వాయు కాలుష్యం ప్రాణాంతకరంగా మారుతోంది.

వివరాలు 8లో ▸



**అపోహలు నమ్మొద్దు**

వక్ఫ్ సవరణ చట్టంపై అపోహలు నమ్మొద్దని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు.

వివరాలు 8లో ▸



**మైనర్లకు బండిస్తే..**

డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన మైనర్ల ముందే వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

వివరాలు 9లో ▸

## న్యూస్‌రీల్

### ప్రజాభిమానం మరవలేను

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



కేక్ కట్ చేస్తున్న చింతా ప్రభాకర్

సంగారెడ్డి: ప్రజల అభిమానం ఎన్నటికీ మర్చిపోలేనని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే తన జన్మదిన సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, జైపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### మెరుగైన వేతన ఒప్పందం మాతోనే సాధ్యం

సీఐటీయూ అధ్యక్షుడు చుక్క రాములు



మాట్లాడుతున్న చుక్క రాములు

జహీరాబాద్ టౌన్: మెరుగైన వేతన ఒప్పందం సీఐటీయూతోనే సాధ్యమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మహీంద్ర కార్మిక సంఘం అధ్యక్షుడు చుక్కరాములు అన్నారు. పట్టణ సమీపంలో గల మహీంద్ర అండ్ మహీంద్ర పరిశ్రమలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహీంద్రలో త్వరలో కార్మిక సంఘం ఎన్నికలు రాబోతున్నాయని, సీఐటీయూను గెలిపించాలని కోరారు. వేతన ఒప్పందం, ఉద్యోగ భద్రత, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం బలపరచాలని కోరారు. ఈ నెల 20న దేశ వ్యాప్త స్వారత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు మల్లేశం, జహీరాబాద్ క్లస్టర్ కన్వీనర్ ఎస్.మహిపాల్, యూనియన్ నాయకులు నరేష్ ఉమామహేశ్వరరావు, కిరణ్, బాలరాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు సన్మానం



పిల్లలను సన్మానించిన అలంగన్‌వాడీ

మునిపల్లి(అందోల్): అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసుకుని పై తరగతులకు వెళ్తున్న చిన్నారులకు టీచర్లు మంజుల, శకుంతల సన్మానించారు. సోమవారం మండలంలోని పెద్దగోపులారంలో అంగన్‌వాడీ కేంద్రంలో వార్షికోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయ బృందం, సూపర్‌వైజర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

### బడిబాట కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, తదితరులు

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం ఖాజాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ నాగరం శ్రీనివాస్ సోమవారం బడిబాట కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మారుతి, టీచర్లు శ్రీకాంత్, భాస్కర్, సీఆర్‌పీ శివకుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు తుకారాం, రాంకిషన్, సాయిలు, మాశ్నప్ప ఉన్నారు.

### బేతాళ స్వామికి ప్రత్యేక పూజలు

మునిపల్లి(అందోల్): బేతాళ స్వామికి మాజీ ఎంపీపీ రాంరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం మండలంలోని మేళసంగ్యం, మగ్దుంపల్లి, కంకోల్ శివారులో బేతాళ స్వామి జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మహోత్సవ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎంపీపీ రాంరెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులకు మగ్దుంపల్లి కాంగ్రెస్ నాయకులు శాలువా కప్పి సన్మానించారు.

# భూ సమస్యలకు పరిష్కారం

**పారదర్శకంగా భూభారతి**

- నిర్దిష్ట గడువులోగా మ్యుటేషన్
- అవగాహన సదస్సులో కలెక్టర్ క్రాంతి



భూ భారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి, వేదికపై ఎమ్మెల్యే మాణిక్‌రావు, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి అదనపు కలెక్టర్ మాధురి, ఏడీఏ భిక్షపతి తదితరులు

జహీరాబాద్/రాయికోడ్(అందోల్): భూ సమస్యలకు భూభారతితో సత్వర పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంపై రైతులు అవగాహన ఏర్పరచుకోవాలని సూచించారు. సోమవారం జహీరాబాద్, మొగుడంపల్లి, అలాగే.. రాయికోడ్ మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుల్లో ఆమె మాట్లాడారు. భూ సమస్యలు కలిగి ఉన్న రైతులు పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ సమస్యలను నిర్దిష్ట గడువులోపు పరిష్కరిస్తామన్నారు. సమస్య పరిష్కారం కాకుంటే కలెక్టర్ లేదా సీసీఎల్ఏకు అప్పీల్ చేసుకోవచ్చని చెప్పారు. ఈ చట్టంలో కొత్తగా ల్యాండ్ ట్రిబ్యునల్ కూడా అందుబాటులో ఉందన్నారు. భూ భారతి చట్టం ద్వారా ఇదివరకటి తరహాలోనే రెవెన్యూ కోర్టులు పునరుద్ధరించిందని వివరించారు. భూ సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకునేందుకు రెవెన్యూ డివిజన్ అధికారి, కలెక్టర్‌కు అధికారాలు కల్పించారని తెలిపారు. అయినా సమస్య పరిష్కారం కాలేదని రైతులు భావిస్తే అప్పీలు చేసుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం ధరణిలో ఉన్న భూ రికార్డులు భూ భారతిలో కొనసాగుతాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా పరిష్కారం కోసం ఈ చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ప్రతి భూ కమతానికి భూదాన్ నంబరు కేటాయించనున్నట్లు తెలిపారు. భూ సరిహద్దు గొడవలు, ఫిర్యాదులు భూ భారతి చట్టం ద్వారా పరిష్కరించుకునే అవకాశం కలిగిందన్నారు. నూతన చట్టం ద్వారా ఇకపై ఫౌతి నెల రోజుల్లో పూర్తి అవుతుందని చెప్పారు. సమావేశంలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీఓ రాంరెడ్డి, ఏడీఏ భిక్షపతి, ఏఓ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

**అర్హులనే ఎంపిక చేయాలి**

రాయికోడ్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలెక్టర్ సమావేశమయ్యారు. అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లకు ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలన్నారు. నిరుపేదలు, వితంతువులు, భూమిలేని వారికే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాయికోడ్‌లో జరిగిన సదస్సులో గ్రంథాలయాల సంస్థల చైర్మన్ అంజయ్య, మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్, ఏఎంసీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సిద్దప్ప పాటిల్, తహసీల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీఓ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# బేషరతుగా రుణాలు

- బ్యాంకర్లకు కలెక్టర్ క్రాంతి ఆదేశం
- యువ వికాస పథకానికి అనూహ్య స్పందన



మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి, చిత్రంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, తదితరులు

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాస పథకానికి ఎలాంటి షరతులు లేకుండా రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పెంపొందించుకునేందుకు ప్రవేశపెట్టిన పథకానికి అనూహ్య స్పందన లభిస్తుందని చెప్పారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని యూనిట్లు మంజూరు చేసి వారికి ప్రొసీడింగ్స్ అందించనున్నట్లు తెలిపారు.ఈ పథకంలో మొదటగా వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, నిరుద్యోగులు, ఇప్పటివరకు ప్రభుత్వ నుంచి రుణం పొందని వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలో 51,657 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్డీఏ పీడీ జ్యోతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

**ప్రజావాణికి 63 అర్జీలు**

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 63 అర్జీలు వచ్చాయి. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్ఓ పద్మజారాణి, పంచాయతీ అధికారి సాయిబాబా, డీఆర్డీఏ జ్యోతి దరఖాస్తులను స్వీకరించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని సూచించారు.

# రేపు జిల్లాకు సీఎం రాక

**జగ్గారెడ్డి కూతురు నిశ్చితార్థానికి హాజరుకానున్న రేవంత్**



క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న ఎస్పీ పరితోష్ పంకజ్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం జిల్లాకు రానున్నారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కూతురు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు తూర్పు జయారెడ్డి (కూచమ్మ), గుణచైతన్యరెడ్డిల నిశ్చితార్థం బుధవారం సంగారెడ్డి పట్టణంలోని జగ్గారెడ్డి నివాసం వద్ద జరగనుంది. ఈ కార్యక్రమానికి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. జపాన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి బుధవారం రాష్ట్రానికి తిరిగి రానున్నారు. అదేరోజు ఆయన ఈ నిశ్చితార్థం కార్యక్రమానికి హాజరు కానున్నారు. సీఎంతో పాటు పలువురు మంత్రులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అగ్రనాయకత్వం ఈ నిశ్చితార్థనికి హాజరు కానున్నారు. అయితే రేవంత్‌రెడ్డి పర్యటన మంగళవారం అధికారికంగా ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు వచ్చే అవకాశాలు ఉండటంతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

**పరిశీలించిన ఎస్పీ**

సీఎంతో పాటు, పలువురు మంత్రుల పర్యటన నేపథ్యంలో ఎస్పీ పరితోష్‌పంకజ్ సోమవారం జగ్గారెడ్డి నివాస ప్రాంతాన్ని పరిశీలించారు. డీఎస్పీ సత్తయ్యగౌడ్, ఇతర పోలీసు అధికారులు కలిసి ఆ ప్రాంతంలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

# ఏఐతో కలుపుతీసే రోబో

**ఆవిష్కరించిన గీతం విద్యార్థులు**





కలుపుతీసే రోబోను చూపిస్తున్న అమూల్య బృందం, చిత్రంలో రోబో

పటాన్‌చెరు: ఆధునిక వ్యవసాయాన్ని మరింత విప్లవాత్మకంగా మార్చడానికి విద్యార్థులు తమ మేధకు పదునుపెడుతున్నారు. గీతంలో చదువుతున్న బీటెక్ ఆఖరి సంవత్సరం విద్యార్థిని సి.అమూల్య నేతృత్వంలో కృత్రిమ మేధస్సు(ఏఐ) సహాయంతో కలుపుతీసే రోబోకు రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా సోమవారం అమూల్యా రోబో గురించి వివరించారు. ఆధునిక సాంకేతికత సహాయంతో అది కలుపు మొక్కలను గుర్తించి తొలగిస్తుందని చెప్పారు. వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా అమూల్యా, ఆమె బృందాన్ని అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, టెక్నాలజీ స్కూల్ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఆర్. శాస్త్రి, అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సీతారామయ్య, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ మాధవి ప్రశంసించారు.

# అర్బన్‌పార్కుకు రూ.3.92 కోట్లు

- ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: అర్బన్ పార్కు అభివృద్ధి కోసం రూ.3.92 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణం పట్టణ సమీపంలో సుమారు 300 ఎకరాల అటవీ ప్రాంతంలో ఈ పార్కును ఏర్పాటు చేస్తామన్నారు. అభివృద్ధిలో భాగంగా వాకింగ్ ట్రాక్, వాచ్‌టవర్, పిల్లల ఆటవస్తువులు, ఆర్టిఫిషియల్ వాటర్వాల్స్ తదితర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి సైతం రూ.2 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో 50 శాతం పనులు పూర్తయ్యాక.. కేంద్రం నిధులు మంజూరు చేస్తుందన్నారు. కమలాపూర్ చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దేందుకు రూ.6 కోట్లతో ప్రతిపాదనలు పంపామని చెప్పారు. నాలుగేళ్లుగా ఈ చెరువు కింద ఆయకట్టుకు సాగు నీరు అందడంలేదని, పూర్తి స్థాయి ఆయకట్టుకు సాగునీటిని అందించేలా ప్రతిపాదనలు రూపొందించామని తెలిపారు. బోరంచ ప్రాంతాన్ని టెంపుల్, ఎకోటూరిజం, బోటింగ్ టూరిజంగా ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిమాపక సేవా వారోత్సవాలు



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం బీహెచ్ఈఎల్ యూనిట్‌లో సోమవారం సీఐఎస్ఎఫ్ అగ్నిమాపక విభాగం ఆధ్వర్యంలో జాతీయ అగ్నిమాపక సేవా వారోత్సవల ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖ పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జీఎం విజయ సాగర్, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ మంజీత్ కుమార్, ఎస్‌డీజీజీఎం అరవింద్ కుమార్, ఇన్‌స్పెక్టర్ బి.ఎస్.భండారి పాల్గొన్నారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ మాక్ డ్రిల్ నిర్వహించారు.

# పింఛన్ ఇక సులభతరం

**ముఖ గుర్తింపు హాజరు అమలుకు కసరత్తు**

- వృద్ధులకు తొలగనున్న ఇబ్బందులు
- త్వరలో అమలు కానున్న విధానం



సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం చేయూత పథకం ద్వారా వివిధ కేటగిరిలలో పింఛన్ పంపిణీ చేస్తుంది. ఈ సందర్భంగా అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వీటిని పరిష్కరించేందుకు సెర్ప్ ఆధ్వర్యంలో ముఖ గుర్తింపు హాజరు పెన్షన్ మంజూరు చేసేందుకు కసరత్తు చేస్తుంది. దీంతో పింఛన్లు పారదర్శకంగా పంపిణీతో పాటు వృద్ధులకు ఇబ్బందులు తొలగనున్నాయి.

**జిల్లాలో 1,55,837 పింఛన్‌దారులు**

జిల్లాలో వివిధ కేటగిరిలలో 1,55,837 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. దివ్యాంగులు, వృద్ధాప్య, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, బీడి, కల్లుగీత కార్మికులు, డయాలసిస్‌తో పాటు తదితరులు ఉన్నారు. వీరిలో అత్యధికంగా వితంతువులు, వృద్ధులు ఉన్నారు. దివ్యాంగులకు రూ.4016, ఇతరులకు రూ.2016లను అందిస్తున్నారు. ప్రతి నెలా రూ.36,15,19,230లు పింఛన్ డబ్బులు తీసుకుంటున్నారు.

**బ్యాంకులు, పోస్టాఫీసుల్లో చెల్లింపులు**

ప్రస్తుతం చేయూత ద్వారా అందించే పింఛన్ డబ్బులు బ్యాంకులు, పోస్టాఫీసుల ద్వారా చెల్లిస్తున్నారు. నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తున్నారు. అయితే డ్రా చేసుకునే సమయంలో వృద్ధులు పలు రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. వేలిముద్రలు రాకపోవటంతో సకాలంలో డబ్బులు అందక అవస్థలు పడుతున్నారు. వేలిముద్రలు రాని వారికి సంబంధిత పంచాయతీ కార్యదర్శి డబ్బులు డ్రా చేసి అందిస్తున్నారు. అధికారులు అందుబాటులో లేని సమయంలో పింఛన్ డబ్బుల కొరకు తిరుగుతూ అనేక ఇబ్బందులు ఎదుర్కొటున్న సందర్భాలు ఉన్నాయి.

**జిల్లాలో పింఛన్‌ల వివరాలు**

| | |
|---|---|
| దివ్యాంగులు | 14,465 |
| వృద్ధులు | 59,083 |
| వితంతువులు | 70,673 |
| చేనేత కార్మికులు | 683 |
| కల్లుగీత కార్మికులు | 813 |
| ఒంటరి మహిళలు | 7,475 |
| బీడి కార్మికులు | 112 |
| ఇతరులు | 2,533 |

**అక్రమాలకు తావు లేకుండా..**

నూతన విధానం అమలుతో వృద్ధులకు వేలిముద్రల సమస్యతో పాటు అక్రమాలకు తావు లేకుండా పంపిణీ చేయనుంది. బ్యాంకులలో నేరుగా వారి ఖాతాల్లో జమ చేయటం ద్వారా వివిధ మార్గాల ద్వారా తీసుకుంటున్నారు. పింఛన్‌దారుడు మృతి చెందిన సమయంలో సమాచారం అందించకపోవటంతో నెలల తరబడి ఖాతాల్లో జమ అయ్యి వారి కుటుంబ సభ్యులు తీసుకున్న సందర్భాలు ఉన్నాయి.

**ముఖ గుర్తింపు హాజరు అమలుకు కసరత్తు**

మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీని అన్ని రంగాల్లో అమలు చేస్తున్నారు. అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు సులభతరంగా పెన్షన్ అందించేందుకు ఫేస్ రికగ్నిషన్ ద్వారా పంపిణీ చేసేందుకు సెర్ప్ ఆధ్వర్యంలో కసరత్తు చేస్తుంది. ప్రత్యేక యాప్ ద్వారా పెన్షన్ దారుడి ముఖాన్ని నిర్ధారణ చేసి పంపిణీ చేయనుంది. మరో రెండు, మూడు నెలల్లో ఈ విధానం అమలులోకి రానుంది.

# వామ్మో.. చిరుత

- సంచారంతో జనం బెంబేలు
- మూగజీవాలు బలి
- అటవీ సమీప గ్రామ ప్రజల ఆందోళన
- మూడేళ్లుగా చిరుత దాడులు



బల్కంచెల్క తండాలో చిరుత దాడితో మృతిచెందిన గొర్రెలు (ఫైల్)



చిరుత పాదముద్రలు

నారాయణఖేడ్: ఈ ప్రాంతంలో చిరుత సంచారం కలకలం రేపుతోంది. నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేట్ గ్రామ శివారులో రైతు నారాయణకు చెందిన లేగదూడను చంపి తినేసింది. పరిసరాల్లో అటవీశాఖ అధికారులు పరిశీలించగా.. చిరుత పాదముద్రలు కనిపించాయి. ఇదే గ్రామంపై ఇదివరకు రెండు మూడు సార్లు చిరుత దాడులు చేసి లేగదూడలను హతమార్చింది. ఇప్పటివరకు పదుల సంఖ్యలో మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. ఎప్పుడు ఎటునుంచి చిరుత దాడి చేస్తుందోనని రైతులు పొలాలకు వెళ్లేందుకు జంకుతున్నారు. వ్యవసాయ క్షేత్రాలకు ఆనుకుని అటవీ ప్రాంతాలు ఉండటంతో ఎక్కడి నుంచి చిరుత దాడికి తెగబడుతుందోనని ఆందోళనకు గురవుతున్నారు.

**అటవీ ప్రాంత గ్రామాల్లో ఆందోళన**

నారాయణఖేడ్, సిర్గాపూర్, కల్హేర్ మండలాల సరిహద్దుగా ఉన్న పలు గ్రామాల్లో అటవీప్రాంతం విస్తరించి ఉంది. కాగా అటవీ ప్రాంతం గుండా చేలల్లోకి సమీపంలోని గ్రామాల్లోకి చిరుత చొరబడుతుంది. ముఖ్యంగా రాత్రి సమయాల్లో దీని సంచారం కన్పిస్తుంది. ఆయా గ్రామాల్లో మూడేళ్ల కాలంలో ఇప్పటివరకు పదుల సంఖ్యలో లేగదూడలను హతమార్చి తినేసింది. సంజీవన్‌రావుపేట్‌లో బుచ్చయ్య, మొగులయ్య, పోశెట్టి, విఠల్, భూపాల్‌లకు చెందిన దూడలను హతమార్చి తినేసింది. వ్యవసాయ క్షేత్రాల్లో, గ్రామ శివార్లలోని పాకల్లో కట్టేసి ఉంచిన వీటిని రాత్రి సమయంలో దాడిచేసి చిరుత చంపేసింది. కల్హేర్ మండలం బల్కంచెల్క తండాలో మూఢ్ దశరథ్‌కు చెందిన 25 గొర్రెల మందపై దాడిచేసి హతమార్చింది. కడ్పల్, నాగ్‌ధర్ గ్రామాల్లో రెండు చొప్పున దూడలను హతమార్చింది. ఇలా సంజీవన్‌రావుపేట్, నాగ్‌ధర్, క్రిష్టాపూర్, ఖాజాపూర్, అలికాన్‌పల్లి, బాచేపల్లి, సిర్గాపూర్, కడ్పల్, ర్యాకల్, రాపర్తి తదితర గ్రామాల శివార్లలో ఈ చిరుత సంచారం కన్పిస్తుంది. కల్హేర్, సిర్గాపూర్, ఖేడ్ మొదలు కొని న్యాల్‌కల్ వరకు పులి సంచారం జాడలు కన్పించాయి.

**రెండేళ్ల క్రితం..**

ఖేడ్ మండలం జూకల్ శివారులో నిర్మాణంలో ఉన్న డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణ కూలీలను సైతం చిరుత వెంబడించింది. కూలీలు రాత్రి సమయంలో బహిర్భూమికి వెళ్లగా దూరం నుంచి గమనించిన చిరుత కూలీలను వెంబడించింది. దీంతో కూలీలు పరుగెత్తుకెళ్లి నిర్మాణంలో ఉన్న డబుల్‌బెడ్‌రూం మూడో అంతస్తుకు పరుగెత్తుకెళ్లారు. అయినా విడవని చిరుత మూడవ అంతస్తు వరకు వెంబడించగా ఎలాగోలా కూలీలు స్లాబ్‌పైకి వెళ్లి చిరుత నుంచి ప్రాణాలు కాపాడుకున్నారు. ఈ సంఘటన అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. పులి సంచరించిన అడుగులు నిర్మాణం ప్రాంతంలో అటవీశాఖ అధికారులు సేకరించారు.

### బీఆర్ఎస్ సభకు తరలిరండి

మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి పిలుపు



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న క్రాంతికిరణ్

మునిపల్లి(అందోల్): ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించే రజోత్సవ సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆవిష్కరించారు. సోమవారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామ శివారులో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ సభకు పార్టీ కార్యకర్తలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి ఇంటికి ఒకరు చొప్పున రావాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శశికుమార్, నాయకులు చీలపల్లి రాంచందర్‌రావు, బుదేరా మల్లేశం, పిల్లోడి ప్రభు, బుదేరా విజయభాస్కర్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్సులో సిద్దిపేట చిన్నోడు


విహాన్ రామ్

మద్దూరు(హుస్నాబాద్): ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలం హనుమతండాకు చెందిన అంతర్జాతీయ పర్వతారోహకుడు జాటోత్ విహాన్‌రామ్‌కు చోటు దక్కింది. ఈ విషయం తండ్రి తిరుపతినాయక్ తెలిపారు. ఆదివారం పంజాబ్ రాష్ట్రంలోని అమృతసర్‌లో ఈ మేరకు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డును జాటోత్ విహాన్‌రామ్ అందుకున్నట్లు తిరుపతి తెలిపారు. ఆఫ్రికా ఖండంలోని అత్యంత ఎత్తైన కిలిమంజారో పర్వతాన్ని, హిమాచల్ ప్రదేశ్‌లోని పాతాల్ పర్వతాన్ని అధిరోహించినందుకు గాను అందించినట్లు తెలిపారు. తన కుమారుడిని ఈ స్థాయికి తీసుకొచ్చిన కోచ్ లెంకల మహిపాల్‌కు అంకితం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. విహాన్ మంచిర్యాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు.

### వారెవ్వా .. వైష్ణవి

- అంతర్జాతీయ బుక్ ఆఫ్ అవార్డ్సులో దామరకుంట విద్యార్థిని


అవార్డును అందుకుంటున్న వైష్ణవి

మర్కూక్(గజ్వేల్): అంతర్జాతీయ బుక్ ఆఫ్ అవార్డ్స్ వారు నిర్వహించిన పోటీల్లో మర్కూక్ మండలం దామరకుంట విద్యార్థిని లింగ వైష్ణవి ఉత్తమ ప్రతిభ కనబర్చింది. దామరకుంట జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వైష్ణవి ఆదివారం పంజాబ్‌లో నిర్వహించిన పోటీల్లో వైష్ణవి పాల్గొని భౌతిక రసాయన శాస్త్రంలో అత్యంత వేగంగా నిమిషం 59 సెంకడ్లలో ఆవర్తన పట్టిక క్రమ రూపం ఏర్పాటు చేసి బుక్ ఆఫ్ అవార్డ్సులో స్థానం దక్కించుకుంది. సోమవారం ఇంటర్ నేషనల్ బుక్ ఆఫ్ అవార్డ్స్ సీఈఓ పంకజ్ వేగ్ చేతుల మీదుగా ట్రోఫీ, బహుమతిని అందుకుందని మండల విద్యాధికారి వెంకట్ రాములు తెలిపారు. వెంకట్‌రాములు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

### సనాతన ధర్మాన్ని కాపాడాలి


ప్రవచనాలందిస్తున్న విద్యారణ్య భారతి స్వామి

పెద్దశంకరంపేట(మెదక్): సనాతన ధర్మాన్ని కాపాడడం అందరి బాధ్యత అని హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతిస్వామి, చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకులు డాక్టర్ సీఎస్. రంగరాజన్ అన్నారు. సోమవారం పెద్ద శంకరంపేటలో నూతనంగా నిర్మించిన రామాలయ ఉత్సవాల్లో వారు పాల్గొని భక్తులకు ప్రవచనాలందించారు. ఆలయ నిర్మాణంలో ప్రతీ ఇంటి నుంచి కులమతాలకు అతీతంగా భాగస్వాములు కావడం అభినందనీయమని కొనియాడారు.

### గుర్తు తెలియని మహిళ మృతి

జహీరాబాద్: రైలు కింద పడి గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన జహీరాబాద్ పట్టణ శివారులో చోటు చేసుకుంది. వికారాబాద్ పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో ఆదివారం రాత్రి రైలు కింద పడి గుర్తు తెలియని మహిళ (45) మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని వికారాబాద్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు వివరించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే సెల్ 84669 38351ను సంప్రదించాలని సూచించారు.

### కులం పేరుతో దూషణ


- ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

మద్దూరు(హుస్నాబాద్) : కులం పేరుతో దూషించి వ్యక్తిపై దాడి చేసిన వారిపై సోమవారం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని ఖాతా గ్రామానికి చెందిన సోలిపురం బాబు శనివారం మిత్రులు సురేశ్, రాజుతో కలిసి ధూల్మిట్టలో వ్యవసాయ పనులకు కూలీ పనికి వెళ్లారు. తిరిగి వస్తూ బాబు, సురేశ్ వైన్స్ వద్ద గల పర్మిట్ రూంలో మద్యం తాగుతుండగా మహిపాల్‌రెడ్డి కులం పేరుతో బాబును దూషించాడు. కర్రతో దాడి చేయగా తలకు గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు కేసు నమోదు చేశారు.

### మద్యం మత్తులో కత్తితో పొడుచుకున్న వ్యక్తి

శివ్వంపేట(నర్సాపూర్) : మద్యం మత్తులో ఓ వ్యక్తి కత్తితో కడుపులో పొడుచుకున్నాడు. ఈ ఘటన మండల పరిధి బోజ్యా తండాలో చోటు చేసుకుంది. తండా వాసుల కథనం మేరకు.. తండాకు చెందిన గగూలోత్ విఠల్ మద్యం మత్తులో సోమవారం తండాలో జరిగిన తమ్ముడి కూతురు పెళ్లిలో హల్‌చల్ చేశాడు. అడ్డుకోబోయిన కుటుంబ సభ్యులతో గొడవ పడి కత్తితో పొడుచుకున్నాడు. పేగులు బయటకు వచ్చి రక్తస్రావం అవుతున్నప్పటికీ గొడవ చేస్తూనే ఉన్నాడు. తండా వాసులు కత్తిని లాగేసుకొని చికిత్స నిమిత్తం పరిస్థితి విషమంగా ఉండటంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు.

# కమ్మేస్తున్న కాలుష్యం


బొల్లారం పారిశ్రామికవాడలో పరిశ్రమల నుంచి వెలువడుతున్న వాయు కాలుష్యం

- ప్రమాదకరంగా బొల్లారం పారిశ్రామిక వాడ
- విచ్చలవిడిగా వాతావరణంలోకి విష వాయువులు
- ఘాటైన వాసనలతో జనాల్లో అనారోగ్య సమస్యలు
- పట్టించుకోని పీసీబీ యంత్రాంగం

జిన్నారం (పటాన్‌చెరు): వాయు కాలుష్యం దినదినం ప్రాణాంతకరంగా మారుతోంది. బొల్లారం పారిశ్రామిక వాడలోని పలు రసాయన పరిశ్రమలు విచ్చలవిడిగా విష వాయువులను వాతావరణంలోకి విడుదల చేస్తూ సామాన్య ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇప్పటికే జల కాలుష్యం పెద్ద ఎత్తున ఉండగా దానికి తోడు వాయు కాలుష్యాన్ని విడుదల చేస్తున్నారు. స్వచ్ఛమైన ఆక్సిజన్ పీల్చుకునే అవకాశాలను సైతం విష వాయువులను విడుదల చేస్తూ హరించేస్తున్నారు. సామాన్య ప్రజల జీవన విధానం పైనే కాకుండా పర్యావరణ పరిరక్షణకు సైతం రసాయన పరిశ్రమలు విగాధం కలిగిస్తున్నాయి.

**రసాయన విష వాయువులు గాలిలోకి..**

పారిశ్రామిక వాడకు చెందిన పలు పరిశ్రమలు గుట్టు చప్పుడు కాకుండా ఉదయం సాయంత్రం వేళల్లో పరిశ్రమల పొగ గొట్టాల ద్వారా పెద్ద ఎత్తున రసాయన విష వాయువులను వాతావరణంలోకి విడుదల చేస్తున్నారు. ఈ వాయువులు స్వచ్ఛమైన ఆక్సిజన్ ను కలుషితం చేస్తూ సామాన్య ప్రజలను ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందికి గురి చేస్తున్నాయి. వీటిపై ఫిర్యాదులు చేసిన పీసీబీ యంత్రాంగం క్షేత్ర స్థాయిలో పర్యటించి చర్యలు తీసుకోవడంలో ఘోరంగా విఫలమవుతున్నారు. ఫిర్యాదులను పెడ చెవిన పెట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

**కాలుష్యం నుంచి కాపాడండి**



పరిశ్రమల నుంచి నిరంతరం వెలువడుతున్న వాయు కాలుష్యంతో జీవన పరిస్థితులు ఇబ్బందికరంగా ఉంటున్నాయి. శ్వాస తీసుకోవడంలో ఆందోళన పడుతున్నాం. పిల్లలు మహిళలు ఘాటైన వాసనలతో అనారోగ్యం పాలవుతున్నారు. ఫిర్యాదులు చేసిన పట్టించుకునే నాథుడే లేడు. మా ప్రాణాలను రక్షించండి.
– ఇమ్రాన్, బొల్లారం కాంగ్రెస్ నాయకులు

**పీసీబీ అధికారుల చర్యలు శూన్యం**



స్థానికంగా వెలువడుతున్న విష వాయువులు సామాన్యులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయని పలు మార్లు పీసీబీ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేరు. సమస్య తీవ్రతరంగా మారుతున్న నిర్లక్ష్యంగా ఉంటున్నారు. అనారోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.
– మద్దూరి పెంటేశ్, బీఆర్ఎస్ నాయకులు

**పిల్లలు, వృద్ధుల్లో అనారోగ్య సమస్యలు**

విషవాయువులు సామాన్య ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ముఖ్యంగా పిల్లలు వృద్ధుల్లో శ్వాసకోశ సమస్యలతో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఇక విషవాయువులు కళ్లలో మంటలు పుట్టిస్తూ, ముక్కుపుట్టలు అదిరేలా చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. పరిశ్రమలను గుర్తించి విషవాయువులను నియంత్రించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని పారిశ్రామిక వాడ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## వక్ఫ్ సవరణ చట్టంపై అపోహలు నమ్మొద్దు

ఎంపీ రఘునందన్ రావు


మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్ రావు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: వక్ఫ్ సవరణ చట్టంపై పేద ముస్లింలలో అపోహలు సృష్టిస్తూ అల్లర్లు రేపే ప్రయత్నాలు జరుగుతున్నాయని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ప్రతిపక్షాలపై మండిపడ్డారు. సోమవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ మాజీ ఎంపీ బీబీ పాటిల్, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. జహీరాబాద్ నియోజకవర్గంలో మొత్తం 12,892 ఎకరాలు వక్ఫ్ భూములుగా నమోదు చేయడం వల్ల వేల మంది రైతులు హక్కులు కోల్పోయారని వాపోయారు. కొండాపూర్ మండలం సైదాపూర్‌లో 197 ఎకరాలు వక్ఫ్ జాబితాలో చేరడం వల్ల సుమారు 200 మంది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే కాకుండా మొగుడంపల్లి, కోహీర్, ఝరాసంగం, న్యాల్కల్, రాయికోడ్ మండలాల్లో పెద్ద ఎత్తున భూములు వక్ఫ్ జాబితాలో చేరాయని ఆరోపించారు. రాష్ట్రంలో పాతబస్తీ వక్ఫ్ ఆస్తులపై సీఎం రేవంత్ రెడ్డి బహిరంగంగా వివరాలు ఇవ్వాలనీ, ముతావలీలు ఎవరి పేర్లపై లీజులకు ఇచ్చారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. 'పట్టణాల్లో వక్ఫ్ భూములు ఆక్రమణకు గురవుతున్నా, అసలు లబ్ధిదారులైన పేద ముస్లింలకు ఉపయోగం లేకుండా పోతోందని, తప్పుడు ప్రచారాలు నమ్మొద్దని తెలిపారు. రైతులు, ప్రజలు చట్టంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజేశ్వర్ రావు దేశ్ పాండేతో పాటు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

- రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీందర్ నాయక్
- కొల్చారం పీహెచ్‌సీ తనిఖీ


రోగులతో మాట్లాడుతున్న రవీందర్ నాయక్

కొల్చారం(నర్సాపూర్): ప్రభుత్వాస్పత్రులకు వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవ లు అందించాలని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీందర్ నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆస్పత్రిలోని ఇన్ పేషెంట్ వార్డులో రోగులకు అందుతున్న సేవలపై సిబ్బందితో ఆరా తీశారు. వైద్యం కోసం వచ్చిన రోగులను పలకరించి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రికార్డును పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్య సేవలపై నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని, ఎట్టి పరిస్థితుల్లో రోగులకు అసౌకర్యం కలిగించొద్దని సిబ్బందిని ఆదేశించారు. అక్కడి నుంచి అంశాన్ పల్లిలో కొనసాగుతున్న ఆయుష్మాన్ భారత్ సెంటర్‌ను సందర్శించారు. ఆయన వెంట జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, నర్సాపూర్ డివిజన్ వైద్యాధికారి సజన, ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రమేశ్, ఎంపీహెచ్ఓ మదన్ మోహన్, సిబ్బంది ఉన్నారు.

## సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలి

- ఎస్సీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య
- కొల్చారంలో విగ్రహ ఏర్పాట్ల స్థల పరిశీలన


పోలీసులతో చర్చిస్తున్న వెంకటయ్య

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రం కొల్చారంలో డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు, అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యను ప్రజలు, యువత సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఎస్సీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం గ్రామంలో వివాదాస్పదంగా మారిన అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు, శివాజీ విగ్రహ ఏర్పాటుకు సంబంధించి స్థలంను వెంకటయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. అంబేడ్కర్‌ను, శివాజీ మహారాజ్‌ను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మొదట పెట్టిన అంబేడ్కర్ విగ్రహాన్ని తీసివేయాలనడం సబబు కాదన్నారు. ముందస్తుగానే గ్రామస్తులు ఈ విషయమై చర్చించుకోవాల్సి ఉండేదన్నారు. విగ్రహం ఎదుట మరో విగ్రహం ఏర్పాటు చేయడం ఇబ్బంది కలిగించడమేనని పేర్కొన్నారు. ఎస్పీ, కలెక్టర్ ఈ విషయంలో గ్రామస్తులతో చర్చించి సమస్యను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ మహమ్మద్ గౌస్,దళిత సంఘాల నాయకులు ఉన్నారు.

## భార్యతో గొడవపడి భర్త బలవన్మరణం

జిన్నారం (పటాన్‌చెరు): మద్యం సేవించి భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని జీఎంఆర్ కాలనీలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన దండుగుల కురుమయ్య (39) కుటుంబం బతుకు దెరువు కోసం వచ్చి ఖాజీపల్లి జీఎంఆర్ కాలనీలో స్థిర పడ్డారు. ఆదివారం కురుమయ్య మద్యం సేవించి ఇంటికొచ్చాడు. భార్య ఎల్లమ్మతో గొడవపడి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. క్షణికావేశంలో గ్రామ శివారులోని అడవి మైసమ్మ గుడి సమీపంలోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

**అప్పుల బాధతో వ్యక్తి..**


సిద్ధరాములు (ఫైల్)

రామాయంపేట(మెదక్): పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన సోమవారం మండలంలోని అక్కన్నపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. హవేళీఘనపూర్ మండలం ముద్దుల్‌వాయి గ్రామానికి చెందిన తంత్రి సిద్ధరాములు (55) ఓ కోళ్ల ఫారమ్‌లో పని చేస్తున్నాడు. అప్పుల బాధతో ఫారమ్‌లోనే రసాయనిక మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**ఆర్థిక ఇబ్బందులతో పురుగు మందు తాగి**

పాపన్నపేట(మెదక్): ఆర్థిక ఇబ్బందులతో పురుగు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. పాపన్నపేట మండలం బాచారం గ్రామానికి చెందిన రావుగారి ఆంజనేయులు (38) హైదరాబాద్‌లో మేస్త్రీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో కొంత కాలంగా ఇబ్బందుల పాలవుతున్నాడు. గ్రామంలోని బంధువుల ఇంట్లో 19న జరిగిన విందుకు హాజరయ్యాడు. క్రిమి సంహారక మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురై అపస్మారక స్థితికి వెళ్లాడు. చికిత్స నిమిత్తం మెదక్ నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఆంజనేయులు (ఫైల్)

**అప్పుల బాధతో..**


రాగిరి(ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్) : ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు.ఈ ఘటన మండలంలోని మానెపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన చౌదరిపేట రాగిరి(50) పొలం వద్ద ఇటీవల బోరు వేయగా ఫెయిల్ అయ్యింది. వ్యవసాయానికి కొంత అప్పు చేశాడు. పంట సైతం ఎండిపోవడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. అప్పులు ఎలా తీర్చాలోనని మదనపడుతూ 17న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## ఇంజన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం


మంటల్లో దగ్ధమవుతున్న కారు

కేతేపల్లి: ఇంజన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధమైంది. ఈ ఘటన విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ వద్ద సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరువు మండలం ఇస్నాపూర్‌లో నివాసముంటున్న వీ. వెంకట్రావు రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నాడు. వెంకట్రావు సోమవారం భార్యతో కలిసి కారులో హైదరాబాద్ నుంచి విజయవాడకు బయల్దేరాడు. మార్గమధ్యలో కేతేపల్లి మండలం కొర్లపహాడ్ వద్దకు రాగానే కారు ఏసీలో నుంచి పొగలు వచ్చాయి. గమనించిన వెంకట్రావు దంపతులు కారును రోడ్డు పక్కకు నిలిపి కిందకు దిగారు. వెంటనే ఇంజన్‌లో మంటలు చెలరేగి నిమిషాల వ్యవధిలోనే కారుకు మొత్తం అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. నకిరేకల్ ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలార్పివేశారు. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. బాధితుడు వెంకట్రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొనిల దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివతేజ తెలిపారు.

### విద్యుదాఘాతంతో పంట దగ్ధం


మొక్కజొన్న కంకులు చూపుతున్న రైతు

కంగ్టి(నారాయణఖేడ్): విద్యుదాఘాతంతో మొక్కజొన్న కంకులు బుగ్గిపాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. కంగ్టి మండలం తడ్కల్ గ్రామానికి చెందిన మహ్మద్ సయ్యద్ అనే రైతు పట్టా భూమిలో ఒక ఎకరం మొక్కజొన్న పంట కాలిపోయింది. విద్యుత్ తీగలతో మంటలు చెలరేగి ఉంటాయని రైతు అనుమానం వ్యక్తం చేశారు. మంటలార్పే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రూ.80 వేల విలువ చేసే పంట కాలిపోయినట్లు పేర్కొన్నారు. అధికారులు స్పందించి తమకు ఆర్థికంగా ఆదుకోవాలని రైతు కుటుంబీకులు కోరారు.

### పిడుగుపాటుకు ఇల్లు ధ్వంసం

ములుగు(గజ్వేల్): పిడుగుపాటుకు ఇల్లు ధ్వంసమై మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన ములుగు మండలం బస్వాపూర్‌లో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితులు, గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామంలో సాయంత్రం 4 గంటల సమయంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కురుమ వసంత రామాంజనేయులు దంపతులు నివాసముంటున్న ఇంటిపై ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగు పడటంతో రేకులు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో వసంతకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.


ధ్వంసమైన ఇంటి పైకప్పు

## రచనలు చిరస్థాయిగా నిలిచిపోతాయి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈఓ రాధాకిషన్

హవేళిఘణాపూర్(మెదక్): చరిత్రలో నిలిచిపోయే విధంగా హవేళిఘణాపూర్ విద్యార్థులు పుస్తక రచన చేయడం అభినందనీయమని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రచించిన 'అమృత గుళికలు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సృజనాత్మకత కలిగిన విద్యార్థులు భవిష్యత్‌లో ఏ రంగంలో ఉన్న సమాజ సేవ చేస్తారన్నారు. పుస్తకాలు చదవాల్సిన సమయంలో విజ్ఞానం పొంది పుస్తక రచనలు చేయడం సంతోషమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ స్వాతి, ఉపాధ్యాయులు రాజశేఖర్, శ్యామల, రవీందర్, మహేశ్వరచారీ, అశోక్, ఎల్లమ్మ, రమేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

## మొక్కజొన్న సాగుపై ఆరా

హరిదాసుపూర్‌లో సౌదీ అరేబియా రైతులు


రైతులతో మాట్లాడుతున్న సౌదీ అరేబియా రైతులు

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని హరిదాసుపూర్‌లో సోమవారం సౌదీ అరేబియా రైతులు పర్యటించారు. గ్రామంలోని రైతులను కలిసి జొన్న పంట సాగు పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒక ఎకరాల్లో జొన్న సాగుచేయడానికి ఎంత పెట్టుబడి అవుతుంది? దిగుబడి ఎంత వస్తుంది? మార్కెట్ జొన్న పంటకు డిమాండ్ ఎలా ఉందనే విషయాలపై ఆరా తీశారు. జొన్న సాగు చేయడానికి ఒక ఎకరాకు రూ. 20 వేల పెట్టుబడి వస్తుందని, ఒక ఎకరాలో 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు వివరించారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ మాట్లాడుతూ.. నీటి సాంద్రత తక్కువ ఉన్న ప్రాంతంలో ఎలాంటి పంటలను సాగు చేయాలనే పరిశోధనతో క్షేత్ర స్థాయిలో సాగు వివరాలను తెలుసుకునేందుకు సౌదీ అరేబియా రైతులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు, ఏడీఏ వెంకటలక్ష్మీ, మండల వ్యవసాయాధికారి గణేశ్, ప్రతిభ, ఏఈఓ రవి రైతులు తదితరులు పాల్గొన్నారు.

### చోరీల నిందితుడు అరెస్ట్

– 3.5 తులాల బంగారం, వెండి స్వాధీనం

పటాన్‌చెరు టౌన్: ఇళ్లల్లో చోరీలకి పాల్పడుతున్న దొంగను పోలీసులు అరెస్టు చేశారు. క్రైమ్ సీఐ రాజు కథనం మేరకు.. చందానగర్ పాపిరెడ్డి కాలనీకి చెందిన శివరాత్రి దివాకర్ (23) పటాన్ చెరు డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ కాలనీలో సోమవారం అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. పోలీసులు దివాకర్‌ను అదుపులోకి తీసుకొని విచారించి దొంగతనాలకు పాల్పడే పాత నేరస్తుడిగా గుర్తించారు. ఇటీవల పటాన్‌చెరు పరిధిలో చోరీ చేసిన 3.5 తులాల బంగారం,15 తులాల వెండి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గతంలో సిద్దిపేట, గుమ్మడిదల, రామచంద్రాపురం, చందానగర్, దుండిగల్, బొల్లారం పలు ప్రాంతాల్లో దొంగతనం చేసి 20 కేసుల్లో జైలు శిక్ష అనుభవించి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. నెల రోజుల్లో పటాన్ చెరు పరిధిలో రెండు దొంగతనాలు చేసి తప్పించుకొని తిరుగుతున్నాడని తెలిపారు. పట్టుబడిన దివాకర్ ను రిమాండ్‌కి తరలించినట్లు తెలిపారు.

# గుప్త నిధుల కోసం తవ్వకాలు!

**విశ్వనాథస్వామి ఆలయ ఆవరణలో భారీ గొయ్యి**

- చైర్మన్‌పై భక్తుల ఆగ్రహం
- ఎమ్మెల్యే, పోలీసుల పరిశీలన
- పోలీసుల అదుపులో చైర్మన్


గొయ్యిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని విశిష్ట చరిత్రగల ప్రాచీన కాశీ విశ్వనాథస్వామి ఆలయం ఆవరణలో గొయ్యి తవ్వకం కలకలం సృష్టించింది. గుప్త నిధుల కోసమేనని భక్తులు అనుమానం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కాశీ విశ్వనాథస్వామి ఆలయ ముఖద్వారం ఎదుట ఉన్న మండపానికి ఆనుకొని దాదాపు ఐదు అడుగుల లోతు, 10 అడుగుల వెడల్పుతో గొయ్యిని తవ్వారు. దానిపై పాత గేటు గ్రిల్ వేసి, గొయ్యి కనిపించకుండా ఉండేందుకు గడ్డి, చెట్ల పొదలతో కప్పి ఉన్న విషయాన్ని సోమవారం ఆలయానికి వచ్చిన భక్తులు గుర్తించారు. ఆలయ కమిటీ చైర్మన్ హన్మాండ్లును పిలిపించగా పూజకు వాడిన పూలను వేసేందుకు ఆదివారం తానే అడ్డా కూలీలతో తవ్వించినట్లు తెలపారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలో ఉన్న ఆలయంలో అధికారుల అనుమతి లేకుండా, కమిటీలోని ఇతర బాధ్యులకు తెలపకుండా ఎలా తవ్వించారని భక్తులు ప్రశ్నించారు. పూలను వేసేందుకైతే అంత పెద్ద గొయ్యి, అదీ మండపానికి ఆనుకొని దాని పునాదులు కూలే అవకాశం ఉండేలా తవ్వించడం.. పైగా కనపడకుండా పైన గ్రిల్‌పెట్టి పొదలతో కప్పిఉంచడంలో ఆంతర్యం ఏంటని భక్తులు నిలదీశారు. ఇద్దరు కూలీలతో తవ్వించినట్లు చెబుతుండగా నలుగురితోపాటు ఓ బాబా సైతం ఉన్నట్లు అక్కడున్న వారు చెప్పడంతో గుప్త నిధుల కోసమే తవ్వించారని భక్తులు ఆరోపించారు. విషయం తెలుసుకొని ఎస్సై–2 మొగులయ్య సిబ్బందితో వచ్చి వివరాలు సేకరించారు. విచారణ నిమిత్తం చైర్మన్ హన్మాండ్లును స్టేషన్‌కు తరలించారు.

**గొయ్యిని పరిశీలించిన ఎమ్మెల్యే**

విషయం తెలుసుకొని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, నాయకులు అశోక్‌రెడ్డి గొయ్యిని పరిశీలించారు. ఆలయం ఆవరణలో అపారమైన నిధి ఉందని చైర్మన్ హన్మాండ్లు చెప్పేవారని కొందరు ఎమ్మెల్యేకు వివరించారు. కొత్త ఆలయ కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్ రానున్న తరుణంలో ఘటన జరగడం, పరిస్థితులను బట్టి గుప్తనిధుల కోసమే తవ్వినట్లు ఎమ్మెల్యే అనుమానం వ్యక్తం చేశారు. త్వరగా కొత్త కమిటీ కోసం నోటిఫికేషన్ ఇవ్వాలని దేవాదాయ, ధర్మాదాయశాఖ ఉన్నతాధికారులను ఫోన్ ద్వారా కోరారు. తవ్వకాల విషయంలో కేసు నమోదు చేసి సమగ్రవిచారణ జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఎమ్మెల్యే సూచించారు.